
సాక్షి
నంద్యాల

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళావేదికపై బుధవారం సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. పలు భక్తి గీతాలకు కళాకారులు నృత్యం చేసి అలరించారు.



'తియ్యని' నేస్తం టీబీ

డయాబెటీస్ ఒక్కో అవయవాన్ని దెబ్బతీసుకుంటూ పోతుంది. ఊపిరితిత్తులపై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.70
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 100.784
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 6,821
అవుట్ ఫ్లో	: 10,119

న్యూస్‌రీల్

స్వర్ణ రథంపై ఆదిదంపతులు



స్వర్ణ రథోత్సవ పూజల్లో దేవస్థాన ఈఓ పెద్దిరాజు దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో బుధవారం వేకువజామున అర్చకులు స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం రథారూఢులైన శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. వర్షం కారణంగా ఆలయ మాఢవీధుల్లో స్వర్ణరథం ఊరేగింపు నిర్వహించలేదు. స్వర్ణ రథోత్సవ పూజల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, అర్చక స్వాములు, వేదపండితులు, పలు విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది, శివసేవకులు, భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన నంద్యాల నూతన డీటీఓ



డీటీఓకు బొకే అందజేస్తున్న సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): జిల్లా రవాణా శాఖ అధికారిగా ఐశ్వర్యరెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీఓగా పని చేస్తున్న శివారెడ్డి కాకినాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఐశ్వర్యరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. అంతకు ముందు డీటీఓకు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేశారు.

నేడు మొబైల్ రికవరీ మేళా

బొమ్మలసత్రం: మొబైల్ రికవరీ మేళాను గురువారం నంద్యాల ఎస్పీ కార్యాలయంలో నిర్వహించనున్నారు.జిల్లాలో మొబైల్ పోగొట్టుకొని పోలీసులను సంప్రదించిన బాధితులు ఈ మేళాకు హాజరు కావాలని ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా బుధవారం ఓ ప్రకటనలో కోరారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అందజేస్తామని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు దరఖాస్తు గడువును అక్టోబర్ 3 వరకు పెంచినట్లు డీఈఓ శామ్యూల్ బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లోని విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలను నిర్వహిస్తోంది. పరీక్ష రాసేందుకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులు అర్హులు. కాగా దరఖాస్తు ఎలా చేసుకోవాలో, పరీక్షకు ఎలా ప్రిపేర్ కావాలో, పరీక్షలో ప్రతిభ చూపితే వచ్చే ప్రోత్సాహకాలు ఏమిటో విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించడం లేదు.

గొల్లలేరు.. మరో బుడమేరు!

- మాయమవుతున్న గొల్లలేరు డ్రైన్ కట్టలు
- 130 మీటర్ల వెడల్పు ఉండాల్సిన డ్రైన్ మీటర్‌కే పరిమితం
- అవుకు లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న వరద ముంపు
- ఆక్రమణలు తొలగించకపోతే విజయవాడ తరహాలో ప్రమాదం



ముస్లిం వీధిలోని గొల్లలేరు డ్రైన్ కట్టను చెరిపేసి గ్రావెల్ తోలించి స్థలాలుగా మార్చుకున్న దృశ్యం

అవుకు: అకాల వర్షాలు, ఊహించని వరదలు నిత్యం ఏదో ఒక చోట చూస్తూనే ఉన్నాం. వరద బీభత్సానికి భారీగా ఆస్తి నష్టంతోపాటు ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి వరద ముంపు కళ్ల ముందు కనబడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. అవుకు రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరితే దిగువకు వదిలేందుకు నిర్మించిన గొల్లలేరు డ్రైన్ ఆక్రమణకు గురవుతోంది. వరద నీరు గ్రామం, పొలాల్లోకి రాకుండా డ్రైన్ వెంబడి ఏర్పాటు చేసిన ఎత్తైన మట్టికట్టలను కొందరు వ్యక్తులు చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. జలాశయం నుంచి వరద నీటిని వదలాల్సి వస్తే డ్రైన్‌కు అతి సమీపంలో ఉన్న అవుకు పట్టణం దాదాపు సగభాగం ముంపునకు గురై తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉంది. అవుకులోని తిమ్మరాజు, గొల్లలేరు, పాలేరు చెరువులను అనుసంధానం చేస్తూ 4 టీఎంసీల సామర్థ్యంతో అవుకు రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌కు శ్రీశైలం బ్యాక్ వాటర్, చుట్టూ కొండల నుంచి వరదనీరు భారీగా చేరుతుంది. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండినప్పుడు, సామర్థ్యానికి మించిన వరద వచ్చినప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగకుండా వరద నీటిని తరలించటానికి ఆరు స్పిల్‌వే గేట్లను అమర్చారు. ఈ గేట్ల ద్వారా ఒకేసారి 20 వేల క్యూసెక్కుల వరద నీటిని కుందూ నదిలో కలిపేందుకు 2010లో గొల్లలేరు డ్రైన్ పనులు చేపట్టారు. అవుకు స్పిల్‌వే గేట్ల నుంచి 130 మీటర్ల వెడల్పుతో 15.6 కిలో మీటర్ల వరకు రూ.14.75 కోట్లతో గొల్లలేరు డ్రైన్ పనులు పూర్తి చేశారు. 70 మీటర్ల వెడల్పుతో డ్రైన్‌ను, డ్రైన్‌కు ఒక్కోవైపు 30 మీటర్ల వెడల్పుతో దాదాపు 25 అడుగుల ఎత్తుతో మట్టికట్టలను నిర్మించారు.

నాడు నదిలా.. నేడు పిల్ల కాల్వలా

వరద నీటిని కుందూనదికి తరలించేందుకు వీలుగా 130 మీటర్ల వెడల్పుతో నిర్మించిన గొల్లలేరు డ్రైన్ ప్రస్తుతం ఆక్రమణలతో చాలా చోట్ల కేవలం మీటర్, రెండు మీటర్ల వెడల్పుతో పిల్లకాల్వను తలపిస్తోంది. అవుకు రిజర్వాయర్ నుంచి గండికోటకు నీటిని తరలించడానికి చెర్లోపల్లె గ్రామ సమీపంలో హెడ్ రెగ్యులేటర్ గేట్లను నిర్మించటంతో భూ ఆక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. అడ్డూ అదుపు లేకుండా డ్రైన్‌కు రెండువైపులా ఏర్పాటు చేసిన మట్టికట్టలను పూర్తిగా చదును చేసి కాల్వను సైతం పూడ్చేస్తూ ఆక్రమించేశారు. ముఖ్యంగా ముస్లింవీధిలో ఓ వ్యక్తి డ్రైన్ కట్టలను పూర్తిగా చేరిపేసి ముస్లిం వీధికి సమాంతరంగా ఉండేలా తన స్థలంలోకి కలిపేసుకున్నాడు. ముస్లింవీధిలో ఆ డ్రైన్‌కు ఆనుకొని కేవలం 5 నుంచి 10 అడుగుల దూరంలోనే గృహాలు ఉండటంతో ఆ వీధి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఆక్రమణలు అధికారులు రోజూ గమనిస్తున్నా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి 544డీ అవుకు నుంచి తాడిపత్రి వెళ్లే రహదారిలో ఉన్న బ్రిడ్జ్ వద్ద ఉన్న ఓ రైస్‌మిల్ పక్కన, అవుకు - కోవెలకుంట్ల రహదారిలో ఉన్న వంతెన వద్ద ఆక్రమణలు అధికారుల కళ్లకు కనబడుతున్నా చర్యలు తీసుకోవడం లేదు.

మేల్కోకపోతే ముంచేస్తుంది..

ఇటీవల విజయవాడలో బుడమేరు వాగు వరద ఉధృతికి జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది. గొల్లలేరు డ్రైన్ ఆక్రమణలు తొలగించకపోతే అవుకు పట్టణంలోని ముస్లిం వీధి, మండపం వీధికి వరద ప్రమాదం పొంచి ఉంది. గతంలో అవుకు రిజర్వాయర్‌కు వరద రావడంతో పూర్తిస్థాయిలో గొల్లలేరుకు ఇరువైపులా ఎత్తైన మట్టికట్టలు ఉన్న సమయంలోనే స్పిల్‌వే గేట్లు ఎత్తారు. ఆ సమయంలో నీటి ప్రవాహంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. లోతట్టు ప్రాంతాలైన మండపం వీధి, ముస్లింవీధుల్లో ఇళ్లలోకి నీరు చేరి దాదాపు పది రోజులపాటు ప్రజలు ఇబ్బందులు పడిన సందర్భం కూడా ఉంది. ప్రస్తుతం ఎలాంటి మట్టికట్టలు కూడా లేవు. ఓ వైపు కబ్జాదారులు డ్రైన్ మట్టికట్టలను పూర్తిగా చెరిపేసి ఆక్రమించుకున్నారు. మరో వైపు స్పిల్‌వే గేట్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరినట్లు తెలుస్తోంది. గేట్ల నుంచి లీకేజీ అధికమై ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో ఊహించని పరిస్థితుల్లో ఉంది. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే అవుకు మరో బుడమేరు అయ్యే ప్రమాదం ఉంది.



గొల్లలేరు డ్రైన్ కబ్జాకు గురైన దృశ్యం (ఫైల్)

ఆక్రమణలు తొలగించాలి



గొల్లలేరు డ్రైన్, మట్టికట్టలను కబ్జాదారులు పూర్తిగా ఆక్రమించేశారు. చిన్నపాటి వరద నీరు వస్తేనే ఇళ్లలోకి నీరు వచ్చే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తక్షణమే ఆక్రమణలను తొలగించకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– గాజుల శంకరప్ప, ముస్లింవీధి, అవుకు గ్రామం.

డ్రైన్ కట్టలను పూర్వస్థితికి తీసుకురావాలి



గొల్లలేరు డ్రైన్ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. దీనివల్ల కలిగే దుష్పరిణామం తెలియక కొంతమంది మట్టికట్టలను పూర్తిగా చెరిపేసి సాగు చేసుకుంటున్నారు. డ్రైన్‌కు భారీ వరద వస్తే పొలాలు, ఇళ్లు కూడా జలమయమవుతాయి. రాబోయే ప్రమాదాన్ని అరికట్టాలంటే గొల్లలేరు డ్రైన్, మట్టికట్టలను పూర్వస్థితికి తీసుకురావాలి.

– బాల దస్తగిరి, మండపంవీధి, అవుకు గ్రామం.

కబ్జాలు వాస్తవమే

అవుకు రిజర్వాయర్ నుంచి వరదనీటిని తరలించటానికి ఏర్పాటు చేసిన గొల్లలేరు డ్రైన్ కబ్జాకు గురవుతున్న విషయం వాస్తవమే. ఆక్రమణలు అరికట్టాలని పదేళ్ల క్రితం అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాం. డ్రైన్‌కు సంబంధించి రికార్డులు తమ కార్యాలయంలో కనిపించటం లేదు. ఆ రికార్డుల కోసం ఆర్డీఓకు లేఖ రాశాం.

– బనగానపల్లె ఎస్సార్బీసీ ఈఈ సురేష్ బాబు

గేట్లకు మరమ్మతులు చేయాలి

ఎంతో కాలంగా గేట్లు ఎత్తకపోవటంతో స్ట్రక్ అయిపోయాయి. దీంతో నీటి లీకేజీ సమస్య ఉంది. గేట్ల మరమ్మతుల కోసం గతంలో రూ.1.62 కోట్లు నిధులు మంజూరు కాగా దాదాపు రూ.50 లక్షల వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు అధికంగా ఉండటం వలన పనులు ఆగిపోయాయి. – అవుకు ఎస్సార్బీసీ ఈఈ సురేష్



సంక్షేమభవన్ వెనుక నిరుపయోగంగా పవర్ ఆటోలు

'స్వచ్ఛ' వాహనం.. చెత్త నిర్ణయం!

- రూ.64లక్షల విలువైన 32 పవర్ ఆటోలు నిరుపయోగం

టీడీపీ ప్రభుత్వ పనితీరుకు సంక్షేమ భవన్‌లో మూలనపడిన ఈ పవర్ ఆటోలే నిదర్శనం. ఎలాంటి ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం ఎవరికీ ఉపయోగం లేకుండాపోయింది. గ్రామాల్లో ఇంటింటి చెత్తను సేకరించే ఉద్దేశంతో పవర్ ఆటోలను తెరపైకి తీసుకొచ్చింది. 2018–19 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఉమ్మడి కర్నూలు జిల్లాకు 292 ఆటోలను మంజూరు చేసింది. ఒక్కో ఆటో విలువ రూ.2 లక్షలు కాగా, వీటిని గ్రామీణ ప్రాంతాల్లోని సఫాయి కార్మికులకు రూ.లక్ష సబ్సిడీ, రూ.లక్ష లోన్ పద్ధతిన కేటాయించేందుకు నిర్ణయించింది. ఈ ఆటోలను తీసుకున్న లబ్ధిదారులు ఆయా గ్రామ పంచాయతీల్లోని చెత్త సేకరణకు వీటిని ఉపయోగిస్తే, సదరు గ్రామ పంచాయతీ ఇచ్చే సొమ్ములో కొంత భాగాన్ని లోన్‌కు జమ చేసి మిగిలిన సొమ్మును కుటుంబ పోషణకు వినియోగించుకోవాల్సి ఉంది. మొదట ఈ ఆటోలను స్వచ్ఛందంగా కేటాయిస్తారని భావించినా.. లోన్‌తో ముడిపెట్టడంతో ఎవరూ ముందుకురాని పరిస్థితి. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అష్టకష్టం మీద 260 ఆటోలను లబ్ధిదారులకు అందించింది. ఆ తర్వాత ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో 32 ఆటోలు ఇప్పటికీ సంక్షేమ భవన్ వెనుకే ఉండిపోవడం గమనార్హం. నిరుపయోగంగా మారిన ఆటోల విలువ అక్షరాలా రూ.64లక్షలు. ఈ ఆటోల విషయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేసినట్లు చర్చ జరిగింది. చాలా వరకు పంచాయతీలు ఆర్థికంగా చితికిపోవడం, కొన్నింట్లో ఆటోలను నిర్వహించే స్థాయి లేకపోవడంతోనే ఆటోలకు ఈ పరిస్థితి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి మంచిచేసే ఉద్దేశమే ఉంటే.. పంచాయతీలకు ఆటోలను ఉచితంగా అందించేవారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చంద్రబాబు ఏది చేసినా.. దానికి వెనుక ఇలాంటి నిరుపయోగమే ఉంటుందనేందుకు ఈ ఆటోలే నిదర్శనం.

– కర్నూలు(అర్బన్)

కొత్త జిల్లాల్లో విద్యుత్ సర్కిళ్లు

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎండీ

కర్నూలు న్యూసిటీ: కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నూతన సర్కిళ్ల ఏర్పాటుకు రాష్ట్ర విద్యుత్ శాఖ ఆమోదించింది. దీంతో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో నాలుగు సర్కిళ్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ సంస్థ పరిధిలో నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం సర్కిళ్లు ఉండేవి. తర్వాత కొత్తగా తిరుపతి, అన్నమయ్య, నంద్యాల, సత్యసాయి జిల్లాలు ఏర్పడ్డాయి. విద్యుత్ సేవలు, సిబ్బంది విభజన కోసం ప్రతి జిల్లాలో ఒక సర్కిల్ ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం సీఎండీ ప్రధాన కార్యాలయం తిరుపతిలో ఉండడంతో నూతన సర్కిల్‌ను చిత్తూరులో ఏర్పాటు చేశారు. అదే విధంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించిన సర్కిల్ కార్యాలయం రాయచోటిలో, సత్యసాయి జిల్లాకు సంబంధించి పుట్టపర్తి పట్టణంలో, నంద్యాలకు సంబంధించి నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీదేవి



శ్రీదేవి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్



హనుమంతరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్



ఎస్.రవికుమార్, డీపీఈఓ, నంద్యాల



ఎం.సుధీర్ బాబు, డీపీఈఓ, కర్నూలు

ఇక్కడున్న శ్రీలత ఏలూరుకు బదిలీ

- అసిస్టెంట్ కమిషనర్‌గా హనుమంతరావు
- ఉమ్మడి జిల్లాలో పలువురు అధికారుల మార్పు

కర్నూలు/బొమ్మలసత్రం: సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ ఈనెల 13న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 19న సిబ్బందిని సెబ్ నుంచి రిలీవ్ చేసి ఎక్సైజ్ శాఖకు పోస్టులు కేటాయించారు. ఇందులో భాగంగా డిప్యూటీ కమిషనర్‌గా శ్రీదేవిని నియమిస్తూ మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఇక్కడున్న శ్రీలతను ఏలూరుకు బదిలీ చేసి హెడ్ క్వార్టర్స్ సెబ్ విభాగంలో పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శ్రీదేవి కర్నూలులో నియమించారు. అలాగే అసిస్టెంట్ కమిషనర్‌గా హనుమంతరావు నియమితులయ్యారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు ఈయన సమీప బంధువు.

డబ్బుంటే కోరుకున్న స్థానం...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి జరిగిన ఈ బదిలీల్లో టీడీపీ నేతలతో పాటు ఆ శాఖలోని పెద్ద తలకాయలకు కాసుల పంట పండిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బదిలీల్లో నేతల సిఫారసులు, ధన ప్రవాహం కీలకంగా పనిచేశాయనే చర్చ జరుగుతోంది. జిల్లా ఎక్సైజ్ శాఖలో ఓ కీలక పోస్టుకు రూ.30 లక్షలు రేటు పెట్టి ఓ అధికారి దక్కించుకున్నారని సమాచారం. ఆ పోస్టుకు పలువురు పోటీ పడినప్పటికీ సంబంధిత శాఖ మంత్రి పేషీలో కీలకంగా వ్యవహరించే ఒకరికి కప్పం చెల్లించి సీటు పదిలం చేసుకున్నట్లు ప్రచారం ఉంది.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ స్వరూపం ఇదీ..

ఉమ్మడి కర్నూలు జిల్లాకు పర్యవేక్షకులుగా డిప్యూటీ కమిషనర్ వ్యవహరించనున్నారు. రెండు జిల్లాల పరిపాలన వ్యవహారాలు వీరు చూస్తారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం అసిస్టెంట్ కమిషనర్‌ను కేటాయించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఇద్దరు డీపీఈఓ (ఈఎస్)లను కేటాయించారు. వీరికి సహాయకులుగా అసిస్టెంట్ సూపరింటెండెంట్లు ఉంటారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో బదిలీ అయిన అధికారుల వివరాలు...

పేరు	హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.శ్రీలత	ఎక్సైజ్ డీసీ	కర్నూలు	ఏలూరు
పి.శ్రీదేవి	ఎక్సైజ్ డీసీ	హెడ్ క్వార్టర్స్, డీసీ క్రైం (బీఆర్)	కర్నూలు
హనుమంతరావు	ఎక్సైజ్ ఏసీ	హెడ్ క్వార్టర్స్ (సెబ్ నుంచి రిలీవ్)	కర్నూలు
సీహెచ్ మధుమోహన్ రావు	ఎక్సైజ్ ఏసీ	సెబ్, నంద్యాల (బీఆర్)	ఏఎస్ హెడ్ క్వార్టర్స్
ఎస్.రవికుమార్	ఎక్సైజ్ సూపరింటెండెంట్	బీఆర్, కర్నూలు (సెబ్ నుంచి రిలీవ్)	నంద్యాల
రామ్మోహన్ రెడ్డి	ఎక్సైజ్ సూపరింటెండెంట్	బీఆర్, నంద్యాల (సెబ్ నుంచి రిలీవ్)	అనంతపురం
ఎం.సుధీర్ బాబు	డీపీఈఓ (ఈఎస్)	కర్నూలు	కర్నూలు
కె.మణికంఠ	డీపీఈఓ (ఈఎస్)	నంద్యాల	నరసరావుపేట

హామీలు ఆవిరై.. నేతలు కుదేలై!

- అధికార తెలుగుదేశం పార్టీలో నామినేటెడ్ పదవుల లొల్లి
- జెండా మోసిన వారికి దక్కని గుర్తింపు
- 'భూమా' బ్రహ్మానికి మళ్లీ హ్యాండ్ ఇచ్చిన అధిష్టానం
- ఏరాసు, ఏవీని పరిగణలోకి తీసుకోని వైనం
- టీడీపీ అధినాయకత్వం తీరుపై కార్యకర్తల్లో ఆగ్రహం

సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి మళ్లీ నిరాశే ఎదురైంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులు కట్టబెడుతామన్న హామీ సైతం ఆవిరైంది. ఇన్నాళ్లు పార్టీ జెండాను మోస్తే గుర్తింపు లేదని, ఎదురుచూపులే మిగిలాయని ఆశావహులు రగిలిపోతున్నారు. అధికార పార్టీ నామినేటెడ్ పదవుల పంపకం చేపట్టింది. ఒకేసారి 20 కీలక కార్పొరేషన్లకు చైర్మన్లను ప్రకటించింది. అయితే, ఇందులో పార్టీ కోసం పనిచేసిన వారికి మొండి చేయిచూపింది. గత ఎన్నికల్లో నంద్యాల ఎమ్మెల్యే టికెట్ మాజీ ఎమ్మెల్యే భూమాబ్రహ్మానందరెడ్డి ఆశించారు. కానీ, ఆయనకు టికెట్ రాకుండా జిల్లాలోని కొంత మంది నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఎన్నికలు పూర్తయి అధికారంలోకి వస్తే సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తామని చంద్రబాబు, నారాలోకేష్ హామీ ఇచ్చారు. దీంతో ఫరూక్ విజయం కోసం భూమా శ్రమించారు. కానీ, ఎన్నికల్లో గెలిచి ఫరూక్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భూమాను పూర్తిగా దూరం పెట్టేశారు. నామినేటెడ్ పదవి కూడా రాకుండా జిల్లాకే చెందిన మరో మంత్రితో కలిసి చక్రం తిప్పినట్లు సొంత పార్టీ నాయకులే చెబుతున్నారు.

సయోధ్య కుదిర్చినా ఏవీని పక్కన పెట్టేశారు

గతంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఏవీ సుబ్బారెడ్డికి ఈసారి అధిష్టానం మొండిచేయి చూపించింది. పార్టీ కోసం ఐదేళ్లు కష్టపడినా కనీసం పట్టించుకోకపోవడాన్ని ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల సమయంలో ఫరూక్, భూమా బ్రహ్మం మధ్య సయోధ్య కుదర్చడానికి తీవ్రంగా కృషి చేసి సక్సెస్ అయ్యారు. అయితే, ఇప్పుడు మాత్రం ఏవీకి సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా ఫరూక్ రాజకీయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏరాసుకు మళ్లీ నిరాశే

శ్రీశైలం నియోజకవర్గం టికెట్‌ను మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఆశించారు. ఆయనను కాదని బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి సీటు ఇచ్చారు. అయినా, ఆ నియోజకవర్గంతో పాటు పాణ్యం, నందికొట్కూరులో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఏరాసు తన వంతు పాత్ర పోషించారు. దీంతో తమ నాయకుడికి మంచి నామినేటెడ్ పదవి వస్తుందని ఆయన అనుచరులు చెప్పుకుంటూ వచ్చారు. తాజాగా ప్రకటించిన ఆ పదవుల్లో ఆయన పేరు లేకపోవడాన్ని చూసి వారంతా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది.



అనుచరుడికి పదవి ఇప్పించుకున్న బీసీ

ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ధర్మవరం సుబ్బారెడ్డిని ప్రభుత్వం నియమించింది. డోన్ ఎమ్మెల్యేగా గెలిచిన కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిని సుబ్బారెడ్డి ఇంతవరకు కలవనేలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కానీ, ఆయనకు పదవి దక్కేలా చేయడంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. వాస్తవానికి కార్పొరేషన్ పదవుల కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే సిఫారసు లేఖ తప్పనిసరి. అయితే, కోట్లకు ఏమాత్రం తెలియకుండానే సుబ్బారెడ్డి పదవి దక్కించుకోవడం గమనార్హం.

రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడకుండా..

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తన రాజకీయ వారసుడిగా ఫిరోజ్‌ను తెరమీదకు తెస్తున్నారు. ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి నియోజకవర్గాన్ని కుమారుడికి అప్పగించారు. మూడు నెలల కాలంలో రెండు, మూడు వారాలు మాత్రమే ఫరూక్ నియోజకవర్గంలో ఉన్నారు. అధిక సమయం విజయవాడ, హైదరాబాద్‌లోనే గడుపుతున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఫిరోజ్‌కు అండగా ఉండాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కుమారుడి రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భూమా బ్రహ్మాన్ని తొక్కేస్తున్నారని సొంత పార్టీ నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో అధికారికంగా ఏర్పాటు చేసే ప్రతి కార్యక్రమానికి ఫిరోజ్ మాత్రమే హాజరవుతున్నారు. అధికారులు కూడా ఆయనకే విలువ ఇస్తుండడం భూమా అనుచరులను ఆవేదనకు గురిచేస్తోంది. తమ నాయకుడికి జరుగుతున్న అవమానాలను భరించలేక ఇటీవల కొందరు ఫిరోజ్‌పై దాడికి కూడా పాల్పడ్డారు. ఈ పరిస్థితుల్లో నామినేటెడ్ పదవి కూడా దక్కకపోవడంతో అధిష్టానంపై భూమా అనుచరులు గుర్రుగా ఉన్నారు.

క్లుప్తంగా

పంట కాల్వలో పడి బాలుడి మృతి


హర్షవర్ధన్(ఫైల్)


ఆత్మకూరు రూరల్: ఆరేళ్ల బాలుడు పంట కాల్వలో పడి మృతిచెందిన విషాద కర ఘటన మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బెస్త మల్లికార్జున కుమారుడు హర్షవర్ధన్(6) సరదాగా తాత నాగలక్ష్మయ్య వెంట గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. ఈక్రమంలో గొర్రెలను అదిలించేందుకు తాత వాడే చేతి కర్రకు బురద అయ్యిందని హర్షవర్ధన్ పక్కనే ఉన్న పంట కాల్వలో శుభ్రం చేసేందుకు వెళ్లాడు. కాల్వ ఒడ్డున బురద ఉండడంతో కాలు జారి హర్షవర్ధన్ అందులో పడిపోయాడు. బాలుడు ఎంత సేపటికీ రాకపోయే సరికి అనుమానంతో బాలుడి తాత కాల్వ వద్దకు వెళ్లగా అక్కడ కర్ర మాత్రమే కనిపించడంతో చుట్టుపక్కల రైతుల సాయంతో గాలించగా బాలుడి మృతదేహం లభ్యమైంది.

కుంగిన తిమ్మరాజు చెరువు కట్ట

- భయాందోళనలో ప్రజలు


కుంగిన చెరువు కట్ట(రివెట్‌మెంట్)

అవుకు: మండల కేంద్రం సమీపంలోని చెర్లోపల్లె రహదారిలో ఉన్న తిమ్మరాజు చెరువు కట్ట (రివెట్‌మెంట్) కుంగిపోవడం, కింద నుంచి నీళ్ల లీకేజీ అవుతుండటంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవేళ చెరువు కట్ట తెగితే పరిసర గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం సమీపంలోని మూడు చెరువులను అనుసంధానం చేస్తూ అవుకు రిజర్వాయర్ నిర్మించారు. 4 టీఎంసీల నీటిని నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జీఎన్ఎస్ఎస్, ఎస్సార్బీసీ కాలువల ద్వారా వరద నీరు రిజర్వాయర్‌లోకి వస్తుండంటంతో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ ఉంచారు. దీంతో తిమ్మరాజు చెరువు కట్ట (రివెట్‌మెంట్) కుంగి చెరువుకు కింది భాగాన నీరు లీకేజీ అవుతోంది. ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబును వివరణ కోరగా తిమ్మరాజు చెరువుకు గతంలో ఉన్న స్లూయిస్(తూము)ను తొలగించి చెరువుకు చివరన కొత్త స్లూయిస్‌ను ఏర్పాటు చేశారని, అప్పటి నుంచే స్వల్పంగా నీటి లీకేజీ ఉందన్నారు. కట్ట కుంగిన చోట మట్టిని వేయించి దృఢంగా తయారు చేస్తున్నామని తెలిపారు. దీనివలన ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని, ప్రజలు భయపడొద్దని సూచించారు.



పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉన్న అవుకు రిజర్వాయర్

‘తియ్యని’ నేస్తం టీబీ

షుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ ముప్పు

- ఒకేసారి రెండూ ఉంటే ఆహార నియంత్రణ కష్టం
- మాత్రలతో లొంగని మహమ్మారి
- టీబీ వస్తే ఇన్సులిన్ వాడాల్సిందే..!

మనిషికి డయాబెటీస్ వస్తే ఆ తర్వాత క్రమంగా శరీరాన్ని ఛిద్రం చేస్తుంది. నియంత్రణలో లేకపోతే ఈ మహమ్మారి ఒక్కో అవయవాన్ని దెబ్బతీసుకుంటూ పోతుంది. ఒకవైపు వ్యాయామం చేస్తూ మరోవైపు ఆహారాన్ని మితంగా తీసుకుంటూ ఇంకో వైపు వైద్యులిచ్చిన మందులను మింగుతూ క్రమబద్ధమైన జీవితాన్ని పాటిస్తేనే ఈ వ్యాధి అదుపులో ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఏదో ఒక రూపంలో ఇతర జబ్బులు దాడి చేస్తాయి. అందులో ప్రధానమైనది క్షయ. షుగర్ నియంత్రణలో లేకపోతే క్షయ ఊపిరితిత్తులపై దాడికి సిద్ధమవుతుంది. ఒకే సమయంలో ఈ రెండు జబ్బులను నియంత్రించుకోవాలంటే ఆ వ్యక్తికి కత్తిమీద సాములా జీవితం సాగుతుంది. – కర్నూలు(హాస్పిటల్)



జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం గత నాలుగేళ్లలో 25,279 మందికి క్షయ వ్యాధికి చికిత్స తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవి ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్న వారి లెక్కలు మాత్రమే ఇంకా కొందరు ప్రైవేటు వైద్యుల వద్ద గుట్టుగా చికిత్స తీసుకుంటూ ఉంటారు. వారి సంఖ్య మరో 10 శాతానికి పైగానే ఉంటుంది. ఈ లెక్కన గత నాలుగేళ్లలో దాదాపు 30 వేల మంది దాకా ఈ వ్యాధికి చికిత్స తీసుకున్నట్లు అంచనా. 20 ఏళ్ల క్రితం క్షయ వ్యాధికి గురైతే 26 శాతం మంది మరణించేవారు. ఆధునిక మందులు, చికిత్సా విధానంలో మార్పుల కారణంగా ఇది ఐదు శాతానికి తగ్గింది. ప్రస్తుతం కొత్తగా నమోదవుతున్న వ్యాధిగ్రస్తుల్లో షుగర్ రోగులు అధికంగా ఉండటం వైద్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. షుగర్ వ్యాధి వచ్చిందంటే దానిని అదుపులో ఉంచుకోవాలి. కానీ చాలా మంది మందులు సరిగ్గా వాడకపోవడం, వాడినా ఆహార నియమాలు పాటించకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి కారణాలతో వారిలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండటం లేదు. కొంత మందికి తినకముందు 200లకు పైగా, తిన్నాక 350 నుంచి 400లకు పైగా షుగర్ స్థాయిలు ఉంటున్నాయి. ఇలాంటి వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రెండువేల మందికి జంట జబ్బులు

సాధారణంగా ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 20 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 15 శాతం మంది షుగర్ రోగులు ఉన్నట్లు తేలింది. సగటున జిల్లాలో 17 శాతం మంది ఈ వ్యాధిభారిన పడుతున్నారు. మందులు సక్రమంగా వాడకపోవడం, ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉండని వారు అధికంగా ఉన్నారు. ఇలాంటి వారిలో రోగనిరోధక శక్తి తగ్గుతోంది. ఇది గుండె, కిడ్నీ, కాలేయం, కాళ్లు, నరాలు, ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతోంది. ఇటీవల నిర్వహించిన గణాంకాల ద్వారా 8 నుంచి 10 శాతం లోపు షుగర్ రోగులకు క్షయ కూడా వస్తున్నట్లు తేలింది. ఈ మేరకు జిల్లాలో గత నాలుగేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న క్షయ రోగుల్లో దాదాపు 2వేల మందికి షుగర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

నాలుగేళ్లలో క్షయ, షుగర్ కేసులు

సంవత్సరం	టీబీ కేసులు	టీబీ, షుగర్ కేసులు
2021	7,778	672
2022	8,722	640
2023	5,603	4089
2024	3,176	208

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నమోదుకాని కేసులు

ఇప్పటికే షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి క్షయ వ్యాధి వచ్చిందంటే అధిక శాతం మంది ప్రభుత్వ ఆసుపత్రులకు రావడం లేదు. నేరుగా ప్రైవేటు వైద్యుల క్లినిక్‌లనే ఆశ్రయిస్తున్నారు. ఈ కారణంగా అధికారిక లెక్కల్లో వీరి వివరాలు పూర్తిగా నమోదు కావడం లేదు. టీబీ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే తనకున్న జబ్బు విషయం అందరికీ తెలిసిపోతుందనే భయం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది. ఈ కారణంగానే డబ్బు ఖర్చు అయినా ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇలా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే టీబీ/షుగర్ రోగుల సంఖ్య 10 శాతం వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

దగ్గు తగ్గకపోతే గళ్ల పరీక్ష చేయించుకోవాలి



షుగర్ రోగుల్లో ఎవ్వరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, వారు బరువు తగ్గుతున్నా వెంటనే సమీపంలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలి. ఈ పరీక్షలో క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే మందులు కూడా ఉచితంగానే ఇస్తారు. టీబీ మందులు వాడుతున్న వారు తప్పనిసరిగా ఎండోక్రైనాలజిస్టులను సంప్రదించి వారి సూచన మేరకు షుగర్ నియంత్రణకు ఇన్సులిన్ వాడాలి. టీబీ మందులు వాడే పేద వారికి నిక్షయ్ పోషణ యోజన పథకం కింద ప్రతి నెలా రూ.500 చొప్పున మందులు వాడే ఆరు నెలలకు రూ.3వేలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.
– డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, టీబీ మెడికల్ ఆఫీసర్, జిల్లా క్షయ కేంద్రం

షుగర్ రోగుల్లో రోగనిరోధక శక్తి తక్కువ



డయాబెటీస్ రోగుల్లో రోగనిరోధక శక్తి తక్కువ. కాబట్టి ఇలాంటి వారికి క్షయ కూడా త్వరగా సోకే అవకాశం ఉంటుంది. మన ప్రాంతంలో పేదరికం కారణంగా క్షయ రోగులు ఎక్కువ. వ్యాధి వచ్చినా ఆరు నెలల పాటు మందులు వాడే వారు తక్కువ. ఆ మందుల సైడ్ ఎఫెక్ట్‌తో పాటు రెండు నెలలైనా తర్వాత తగ్గిందిలే అనుకుని మానేస్తూ ఉంటారు. దీనివల్ల కొన్నాళ్లకు టీబీ మళ్లీ వస్తుంది. షుగర్ రోగుల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా పరిణమిస్తుంది. వీరు టీబీ మందులు తీసుకునే మొదటి రెండు నెలలు తప్పనిసరిగా ఇన్సులిన్ వాడాలి. – డాక్టర్ కె.వినోద్ ఆచారి, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, కర్నూలు

తూతూ మంత్రంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ తనిఖీలు


యూనిఫార్ వేసుకోకుండా డీఎంఅండ్‌హెచ్ ఓతో మాట్లాడుతున్న ప్రైవేటు వైద్యుడు

బొమ్మలసత్రం: ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ బుధవారం తూతూ మంత్రంగా తనిఖీ చేశారు. మెడిసేవ డయాగ్నోస్టిక్ సెంటర్, శ్రీకరి ఆసుపత్రి, చందమామ చిన్న పిల్లల ఆసుపత్రి, ప్రైమ్‌కేర్ ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ డెంగీ కేసులు ఎక్కువగా ల్యాబ్‌లలో నమోదవుతున్నట్లు అనుమానం రావటంతో తనిఖీ చేశామన్నారు. ఆసుపత్రి నిర్వాహకుల వద్ద అన్ని రకాల రిజిస్ట్రేషన్‌లు సరిగా ఉన్నాయని, నిబంధనల మేరకే వైద్య పరీక్షల ఫీజు వసూలు చేయాలని ఆదేశించామని చెప్పారు. కాగా రక్త పరీక్షల వివరాలు, ధరల పట్టిక ప్రదర్శించకపోవడం, ఫీజు చెల్లించిన రోగులకు బిల్లులు ఇవ్వకపోవడం తదితర విషయాలను పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. జ్వరం పేరుతో ఆసుపత్రికి వెళితే డెంగీ బూచి చూపి లేని పోని రక్తపరీక్షలు చేసి రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజు దండుకుంటున్నా కనీసం మందలించకపోవడంతోపాటు అన్నీ సక్రమమే అని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మద్యం పట్టివేత

- ఐదుగురి నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ కేశవ

కొత్తపల్లి: మండల పరిధిలో వేర్వేరు చోట్ల పోలీసులు మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ కేశవ్ తెలిపిన వివరాలు.. మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. లింగాపురం గ్రామానికి చెందిన చెరుకు మారెన్న, చింతకుంట రవి కొత్తపల్లి నుంచి బైక్‌పై మద్యం తరలిస్తుండగా మంగళవారం రాత్రి పోలీసులు నిఘా ఉంచి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 18 ఆంధ్రాగోల్డ్ క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే యాస సురేష్‌గౌడ్, ప్రభాకర్ గౌడ్‌లు శివపురం గ్రామానికి బైక్‌పై ఆంధ్రాగోల్డ్ 110 క్వాటర్ బాటిళ్లను తరలిస్తుండగా కొత్తపల్లి సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. దుద్యాల గ్రామానికి చెందిన గద్వాల జగన్నాథం ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సోదాలు నిర్వహించి 8 అంబర్ హౌస్ క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మూడు ఘటనల్లో ఐదుగురిని అరెస్టు చేసి, రెండు బైకులు, 136 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు అవుకు క్రీడాకారుడు


ఎంపికైన మిద్దె మధు

అవుకు: అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు అవుకు మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు మిద్దె మధు ఎంపికయ్యారు. ఎస్సీ కాలనీకి చెందిన సాంబశివుడు, గంగాదేవి దంపతుల కుమారుడు మధు ఏడాది ఫిబ్రవరి 2న తమిళనాడులోని రామనాథపురంలో జరిగిన జాతీయస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఏడాది డిసెంబర్ 30, 31, వచ్చే ఏడాది జనవరి 1 వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు హాజరుకానున్నట్లు ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఫార్మా డి పూర్తి చేసి, డోన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన మధుకు కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు అభినందనలు తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల్లో అక్రమాలు


- కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన వెల్ఫేర్ అసిస్టెంట్లు
- డబ్బులు తీసుకొని కావాల్సిన వారిని దగ్గరగా వేసుకున్నారని ఆరోపణ


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కర్నూలు(సెంట్రల్): వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల్లో భారీగా అక్రమాలు జరిగాయని కొందరు బాధిత ఉద్యోగులు బుధవారం రాత్రి కలెక్టరేట్ ఆందోళనకు దిగారు. డబ్బులు తీసుకొని కావాల్సిన వారిని దగ్గర వేసుకున్నారని, ఫలితంగా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని కర్నూలు, కల్లూరు, కోడుమూరు, గూడూరు, వెల్దుర్తి మండలాల్లోని సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలను సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రంగలక్ష్మీ దేవి చెపట్టారని, అయితే తమను జిల్లా కేంద్రానికి దూరంగా ఉండే మండలాలకు ఉద్దేశపూర్వకంగా బదిలీ చేశారని వాపోయారు. దూరంగా ఉన్న వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని దగ్గరగా వేశారని ఆరోపించారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకోకపోయినా పరిపాలన సౌలభ్యం పేరిట దూరప్రాంతాలకు పంపారని విమర్శించారు. అనంతరం డీఆర్వో చిరంజీవిని కలిసి బదిలీల్లో జరిగిన అన్యాయంపై వినతిపత్రం ఇచ్చారు.

పీజీఆర్ఎస్ వ్యవస్థను పటిష్టం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం
- పీజీఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): పీపుల్ గ్రీవెన్స్ రెడ్రెస్ సిస్టమ్‌ను (పీజీఆర్ఎస్) పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఆడిట్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు సరియైన ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోయినా, పొంతనలేని సమాధానాలు ఇచ్చినా, పూర్తి సమాచారం పొందుపరచకపోయినా రీ ఓపెన్ చేయాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించి అనేక దరఖాస్తులు రీ ఓపెన్ అవుతున్నాయని, ఆ శాఖలకు సంబంధించిన అధికారులను పిలిపించి తక్షణమే క్లియర్ చేయాలన్నారు. ఎస్ఎల్ఏ వ్యవధి 24 గంటలు మాత్రమే ఉండి, పరిష్కరించని అధికారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. అర్జీ పరిష్కారానికి నిర్ణీత గడువు దాటి వెళ్లకూడదన్నారు. సమస్యలకు సత్వర పరిష్కారం లభించినప్పుడు పీజీఆర్ఎస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తున్నట్లు అని చెప్పారు. అర్జీలను పరిష్కరించని పక్షంలో తగు సంజాయిషీతో అదే రోజు సాయంత్రం కలెక్టర్‌ను సంప్రదించేలా అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. ఆడిట్‌లో సరైన ఎండార్స్‌మెంట్ లేని 8 దరఖాస్తులను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఫైర్ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్


నూతన కమిటీ సభ్యులు

కర్నూలు: ఫైర్ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (అగ్నిమాపక సేవల శాఖ)కు నూతన కమిటీ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ఎం.రాజ్‌కుమార్ (కర్నూలు), ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులు (బనగానపల్లె), కార్యదర్శిగా ప్రతాప్ (కర్నూలు), సహాయ కార్యదర్శిగా వై.గోపాల్ (ఎమ్మిగనూరు), కోశాధికారిగా ఎం.నాగరాజు (ఆళ్లగడ్డ), అడ్వైజర్‌గా (సలహాదారు) శివకుళ్లాయప్ప (నంద్యాల)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పర్యవేక్షణలో శివరామిరెడ్డి ఎన్నికల అధికారిగా, అసిస్టెంట్‌గా అవినాష్ వ్యవహరించారు. ఎన్నిక అనంతరం నూతన కమిటీ సభ్యులు రీజినల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహలను మర్యాదపూర్వకంగా కలిసి నూతన కమిటీ ఎన్నిక పత్రాన్ని వారికి అందజేశారు.

వచ్చేనెల 2లోపు కంప్యూటరీకరణ పూర్తి కావాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో అక్టోబరు 2వ తేదీ నాటికి కంప్యూటరీకరణ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్, డీసీసీబీ పీఐసీ చైర్‌పర్సన్ బి.నవ్య పీఏసీఎస్ సీఈఓలను ఆదేశించారు. బుధవారం స్థానిక ఓ హోటల్ సమావేశ మందిరంలో జిల్లాలోని 43 పీఏసీఎస్ సీఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా సహకార కేంద్రబ్యాంకుకు అనుబంధంగా ఉన్న పీఏసీఎస్‌లను కంప్యూటరీ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టుదలతో ఉన్నాయని, నిర్దేశిత గడువులోపు కంప్యూటరీకరణ పూర్తి చేయాలని సూచించారు. కంప్యూటరీకరణతో పీఏసీఎస్‌లోని లావాదేవీల్లో 100 శాతం పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. కంప్యూటరీకరణలో పురోగతి సాధించిన పసుపల, సి.బెళగల్, నన్నూరు పీఏసీఎస్‌లపై ప్రత్యేకంగా సమీక్షించారు. వెనుకబడిన పీఏసీఎస్‌ల సీఈఓలతో సమీక్షించి కారణాలను ఆరా తీశారు. అక్టోబరు నాటికి సంపూర్ణంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసేకోవాలని సూచించారు. అన్ని సహకార సంఘాలను సీబీఎస్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంపై డీసీసీబీ సీఈఓతోపాటు జిల్లా సహకార అధికారి రామాంజనేయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీసీఓ ఎస్.రామాంజనేయులు, డీసీసీబీ సీఈఓ విజయకుమార్, జీఎం పి.రామాంజనేయులు, డీజీఎంలు సునీల్‌కుమార్, నాగిరెడ్డి, డీపీడీఎం నహిదాసుల్తాన, జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీష పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువజనోత్సవం వాయిదా

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 28వ తేదీన స్థానిక పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగాల్సిన జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు నంద్యాల సెట్కూరు ముఖ్య కార్యనిర్వహణాధికారి దీప్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. వివరాల కోసం సెల్: 92922 07601నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

విద్యార్థులను చైతన్యం చేయండి

- కళాశాలల నిర్వాహకులకు ఎస్పీ సూచన



కర్నూలు: సైబర్ నేరాలపై విద్యార్థులను చైతన్యం చేయాలని ఎస్పీ బిందు మాధవ్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. యాంటీ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, సోషల్ మీడియా ప్రభావం, రోడ్డు భద్రత, సైబర్ నేరగాళ్ల వల్ల జరుగుతున్న నష్టాలు తదితర అంశాలపై కళాశాలల యాజమాన్యాలు తీసుకోవాల్సిన చర్యలు, విద్యార్థులకు నిర్వహించాల్సిన అవగాహన సదస్సులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచేందుకు కళాశాలల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, ఫలితంగా భవిష్యత్తును కోల్పోతారని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా క్రయవిక్రయాలు జరిపినా, సేవించినా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అతిగా సెల్‌ఫోన్ వినియోగం, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ లాంటి సామాజిక మాధ్యమాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండేలా, సోషల్ మీడియా వేధింపులపై కూడా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. అనవసరమైన లింక్‌లు షేక్ చేయకూడదని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లోన్ యాప్స్, ఇన్వెస్ట్‌మెంట్లు, ఏపీకే ఫైల్స్, బెట్టింగ్ యాప్స్ లాంటి వాటితో విద్యార్థులు మోసపోకుండా ఉండేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

సైబర్ నేరాలపై 1930కి సమాచారమివ్వండి

సైబర్ నేరాలకు ఎవరు గురైనా వెంటనే 1930కి సమాచారమివ్వాలని ఎస్పీ సూచించారు. సైబర్ క్రైం పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయాలంటే ఒక్క పోలీస్ వ్యవస్థతోనే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఎస్ఐ ఖాజావలి పాల్గొన్నారు.